# సాక్షి శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం । 2 । జూన్ । 2024




## చీనీ టన్ను రూ.38 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనివారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.36 వేలు పలికాయి. మార్కెట్‌కు 670 టన్నుల చీనీకాయలు అమ్మకానికి వచ్చాయి.



## జిల్లా వ్యాప్తంగా వర్షం

శనివారం రాత్రి జిల్లా వ్యాప్తంగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఆదివారం కూడా జిల్లాకు భారీ వర్ష సూచన ఉన్నట్లు వాతావరణ శాఖ చెబుతోంది.




జిల్లావ్యాప్తంగా శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. గంటకు 8 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

## న్యూస్‌రీల్

### కౌంటింగ్ విధులకు గైర్హాజరైతే చర్యలు



ర్యాండమైజేషన్ చేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: కౌంటింగ్ విధులకు ఎవరు గైర్హాజరైనా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అరుణ్‌బాబు హెచ్చరించారు. శనివారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ కేంద్రంలో కౌంటింగ్ విధుల్లో పాల్గొననున్న 827 మంది సిబ్బందికి రెండో విడత ర్యాండమైజేషన్ పూర్తి చేసి ఆయా నియోజకవర్గాలకు కేటాయించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, నియామక ఉత్తర్వులను సంబంధిత నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ద్వారా అందజేస్తామన్నారు. కౌంటింగ్ సిబ్బందికి ఆయా ఆర్‌ఓల ఆధ్వర్యంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. త్వరలోనే మూడో విడత ర్యాండమైజేషన్ పూర్తి చేసి ఏ టేబుల్ వద్ద విధులు నిర్వర్తించాలో తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో కౌంటింగ్ అబ్జర్వర్ స్నేహల్ పి.నాయక్ గొల్టేకర్, డీఆర్‌ఓ కొండయ్య, ఆర్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

### వ్యాను, ఆటో ఢీ.. ఇద్దరి మృతి



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన ఆటో, మృతి చెందిన గొల్లనారాయణ, కిష్టయ్య

చెన్నేకొత్తపల్లి: ఆటోను వ్యాను ఢీ కొన్న ఘటనలో ఇద్దరు మృత్యువాత పడ్డారు. ఈ ఘటన శనివారం మండల పరిధిలోని బసంపల్లి బస్టాండ్ వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... ధర్మవరం పట్టణంలోని లక్ష్మీ చెన్నకేశవపురానికి చెందిన గొల్ల నారాయణ(54) అతని మిత్రుడు ఇందిరమ్మ కాలనీకి చెందిన కిష్టయ్య( 67) పని నిమిత్తం శనివారం ఉదయం పుట్టపర్తికి వెళ్లారు. అక్కడ పని ముగించుకుని ఆటోలో తిరుగుపయనమయ్యారు. ఆటో బసంపల్లి సమీపంలోకి రాగానే ఎదురుగా వచ్చిన వ్యాను బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో నారాయణ, కిష్టయ్య అక్కడికక్కడే మృతి చెందారు. మగ్గంపై ఆధారపడి బతికే కిష్టయ్యకు కుమారుడు వేమ నారాయణ, కుమార్తె పద్మావతి ఉన్నారు. భార్య 5 నెలల క్రితం మృతి చెందింది. గొల్ల నారాయణ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించేవాడు. అతని మృతితో భార్య తిప్పమ్మ, కుమారులు హరి, సురేష్ పరిస్థితి అగమ్యగోచరమైంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాలను ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## జై భజరంగ భళీ

- హనుమజ్జయంతి వేడుకలతో జిల్లాకు ఆధ్యాత్మిక శోభ

'జై హనుమాన్... జై భజరంగ భళీ' అంటూ భక్తులు కీర్తించగా పవనపుత్రుడి నామస్మరణ జిల్లా అంతా ప్రతిధ్వనించింది. హనుమజ్జయంతి సందర్భంగా శనివారం జిల్లా వ్యాప్తంగా ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. ఉదయం నుంచే ఆలయాల ఎదుట బారులు తీరిన జనం వాయుపుత్రుడికి ప్రత్యేక పూజలు చేశారు. హిందూపురం, కదిరి, పెనుకొండ, మడకశిర ప్రాంతాల్లో వేడుకలు ఘనంగా జరిగాయి. మడకశిర మండలం చందకచెర్లలో హనుమాన్ బ్రహ్మరథోత్సవం వైభవంగా జరిగింది. – సాక్షి నెట్‌వర్క్



హిందూపురంలో హనుమాన్ విగ్రహాన్ని వడలతో అలకరించిన దృశ్యం



ప్రత్యేక అలంకరణలో ధర్మవరం లింగశెట్టిపాలెం అభయాంజనేయస్వామి



మడకశిర మండలం చందకచెర్లలో ఆంజనేయస్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

# భద్రత కట్టుదిట్టం

- కౌంటింగ్ కోసం పోలీసుల ముందస్తు చర్యలు
- గ్రామ సభల ద్వారా ప్రజలకు అవగాహన
- ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద భారీగా సిబ్బంది మోహరింపు
- దుశ్చర్యకు పాల్పడితే కఠిన చర్యలకు సిద్ధం
- హింసాత్మక ఘటనల్లో పాల్గొంటే రౌడీషీట్
- జిల్లా అంతటా 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలు
- విజయోత్సవ ర్యాలీలు, ధర్నాలపై నిషేధం



స్ట్రాంగ్ రూములను పరిశీలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి



మాక్ డ్రిల్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పుట్టపర్తి టౌన్: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు రెండు రోజుల్లో వెలువడనున్న నేపథ్యంలో కౌంటింగ్ కోసం పోలీసులు భద్రత కట్టుదిట్టం చేశారు. ఈ నెల 4న ఓట్ల కౌంటింగ్ నిర్వహిస్తుండగా, కేంద్రాల వద్ద భారీ బందోబస్తుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి తర్వాత జిల్లాలో ఎలాంటి హింసాత్మక సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్పీ మాధవరెడ్డి నేతృత్వంలో పోలీస్ యంత్రాంగం ముందస్తు ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా గ్రామ సభలు నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రశాంత జీవనం గడపాలని, అల్లర్లు, ఘర్షణలకు పాల్పడితే తలెత్తే పరిణామాలు వివరిస్తున్నారు. అలాగే అల్లర్లకు పాల్పడే అవకాశముందని గ్రహించిన వారిని బైండోవర్లు చేశారు. గ్రామాల్లో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు. రౌడీ షీటర్లకూ కౌన్సెలింగ్ ఇస్తున్నారు.

**కేంద్రాల వద్ద మూడంచెల భద్రత..**

ఓట్ల లెక్కింపు కేంద్రాలు ఏర్పాటు చేసిన లేపాక్షి సమీపంలో బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, హిందూపురం 'బిట్' ఇంజినీరింగ్ కళాశాల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. కౌంటింగ్‌లో పాల్గొనే అధికారులు, సిబ్బంది, ఏజెంట్లు, అభ్యర్థులు కౌంటింగ్ కేంద్రంలోకి వచ్చి వెళ్లే మార్గాలు, వాహనాల పార్కింగ్ కోసం రూట్ మ్యాప్ సిద్ధం చేశారు. రెవెన్యూ, ఫైర్ విభాగాలతో పాటు కేంద్ర బలగాలు, వన్‌టైర్, టూ టైర్, త్రీటైర్ పారా మిలటరీ బలగాలను సమన్వయం చేసుకుంటూ భద్రత కట్టుదిట్టం చేశారు. పోస్టల్ బ్యాలెట్లు, ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూములు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ గార్డ్ సిబ్బందికి అప్రమత్తం చేస్తున్నారు.

**నిఘా నేత్రం..**

కౌంటింగ్ కేంద్రాల వద్ద 24 గంటలు పనిచేసేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఇందుకోసం మొత్తం 140 కెమెరాలు అమర్చారు. అలాగే మరో 7 సోలార్ సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేశారు.

| | |
|---|---|
| 101 | జిల్లాలో గుర్తించిన సమస్యాత్మక గ్రామాలు |
| 1,300 | ఇప్పటివరకూ చేసిన బైండోవర్ల సంఖ్య |
| 147 | కౌంటింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు |
| 881 | విధుల్లో ఉండే జిల్లా పోలీసులు |

వీటిని కమాండ్ కంట్రోల్ రూమ్‌తో అనుసంధానం చేసి అక్కడ నుంచి లెక్కింపు ప్రక్రియ పర్యవేక్షించేలా ప్రత్యేక సిబ్బంది నియమించారు. ఎన్నికల ఫలితాలు ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేసేందుకు ఏర్పాట్లు చేశారు. భద్రతా పరమైన కారణాలతో కౌంటింగ్ కేంద్రంలోనికి ఎవరూ సెల్‌ఫోన్ తీసుకుని వెళ్లకుండా చర్యలు చేపట్టారు.

**ఇద్దరు అడిషనల్ ఎస్పీల ఆధ్వర్యంలో బందోబస్తు..**

కౌంటింగ్ కేంద్రాలకు కిలోమీటర్ దూరం వరకు 144 సెక్షన్, 30వ పోలీస్ యాక్ట్ అమలు చేస్తున్నారు. ఇద్దరు అడిషనల్ ఎస్పీలు కౌంటింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు పర్యవేక్షించనున్నారు. అలాగే కేంద్ర ఆర్మ్‌డ్, ఒక ప్లాటూన్ ఏఎస్పీ బలగాలతో పాటు 9 మంది డీఎస్పీలు, 13 మంది సీఐలు, 64 మంది సివిల్ రిజర్వ్ ఎస్‌ఐలు, 97 మంది ఏఆర్ ఎస్‌ఐలు, 326 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 128 మంది కానిస్టేబుళ్లు, 242 మంది హోంగార్డులను కౌంటింగ్ విధులకు నియమించారు. అలాగే జిల్లాలోని 101 గ్రామాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించి పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.

**ఫ్లాగ్ మార్చ్ ద్వారా అవగాహన..**

స్థానిక పోలీసులు కేంద్ర బలగాలతో కలసి జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే కార్డెన్ సర్చ్‌లు, ఫ్లాగ్‌మార్చ్‌లు నిర్వహించారు. ఘర్షణలు, అల్లర్లకు దూరంగా ఉండాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అంతేగాక హింసాత్మక ఘటనలు చోటుచేసుకుంటే పోలీసులు స్పందించే తీరును మాక్‌డ్రిల్స్ ద్వారా ప్రజలకు ప్రత్యక్షంగా చూపుతున్నారు. గ్రామాల్లో శాంతి కమిటీలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీ నేతలతో ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించి ప్రశాంత వాతావరణం నెలకొనేలా చర్యలు చేపట్టారు. కౌంటింగ్ ప్రశాంతంగా సాగేలా సహకరించాలని కోరుతున్నారు. సమస్యాత్మక గ్రామాల్లో ఎస్పీ మాధవరెడ్డి స్వయంగా సందర్శించి సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యపరిచారు.

**ర్యాలీలు, ధర్నాలు నిషేధం..**

కౌంటింగ్ రోజైన జూన్ 4వ తేదీన జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుంది. ఫలితాల వెల్లడి తర్వాత ఎవరూ సంబరాలు చేసుకోకూడదని ఇప్పటికే పోలీసు శాఖ స్పష్టమైన ఆదేశాలిచ్చింది. ఊరేగింపులు, ర్యాలీలు నిర్వహించకూడదని, బాణసంచా విక్రయాలపై కూడా పోలీసులు నిషేధం విధించారు. అలాగే జిల్లాలోని ఆరువేల ట్రబుల్ మాంగర్స్‌ను గుర్తించి వారిపై ప్రత్యేక నిఘా ఉంచారు. వారి ఇళ్లల్లో కూడా సోదాలు నిర్వహించారు. ఎలాంటి గొడవలకు వెళ్లకుండా అవగాహన కల్పించారు. అలాగే పెట్రోలు, డీజిల్ లూజు విక్రయాలను నిషేధించారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పెట్రోలు బంకుల యజమానులకు ఆదేశాలు జారీ చేశారు.

**లాడ్జీల్లో బసపై ఆంక్షలు..**

ఓట్ల లెక్కింపు ప్రక్రియ నేపథ్యంలో అపరిచితులు, అనుమానితులు లాడ్జీల్లో బస చేయకుండా, పందేలు కాయకుండా తనిఖీలు ముమ్మరం చేశారు. మద్యం తాగి గొడవలకు కారణమయ్యే అవకాశం ఉన్న హోటళ్లలో క్షుణ్ణంగా పర్యవేక్షణ చేపట్టారు.

**1,300 మంది బైండోవర్..**

కౌంటింగ్ రోజున ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమస్యాత్మకమైనవిగా గుర్తించిన గ్రామాల్లో పికెట్లు ఏర్పాటు చేశారు. ఇప్పటికే గుర్తించిన ట్రబుల్ మాంగర్స్‌కు నోటీసులు ఇచ్చి వారిపై ప్రత్యేక నిఘా పెట్టారు. గొడవలకు దిగే రౌడీ షీటర్లు, అనుమానితులను 1,300 మందిని బైండోవర్ చేశారు. ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో రెండుసార్లు కౌన్సెలింగ్ ఇచ్చారు. అప్పటికీ అల్లర్లకు దిగితే జైలుకు వెళ్తారని హెచ్చరిస్తున్నారు.

### హద్దు దాటితే కఠిన చర్యలు



కౌంటింగ్ సందర్భంగా ఎవరు హద్దు దాటినా చర్యలు కఠినంగా ఉంటాయి. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా వ్యాప్తంగా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశాం. కౌంటింగ్ కేంద్రాల సమీపంలో సీసీ కెమెరాలతో నిఘా పటిష్టం చేశాం. ఎక్కడ అల్లర్లు జరిగినా స్పందించే విధంగా మొబైల్ టీంలు ఏర్పాటు చేశాం. స్ట్రాంగ్ రూముల వద్ద నుంచి కౌంటింగ్ హాల్ వరకు వచ్చే మార్గాలు కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. పోలీసులకు అభ్యర్థులు, ఏజెంట్లు, ప్రజలు సహకరించాలి.

– మాధవరెడ్డి, ఎస్పీ

### ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలి

- భద్రతాపరంగా ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదు
- సిబ్బందికి డీఐజీ షిమోషి, ఎస్పీ మాధవ్ రెడ్డి ఆదేశం



భద్రత ఏర్పాట్లపై అధికారులకు సూచనలిస్తున్న డీఐజీ షిమోషి

హిందూపురం: కౌంటింగ్ కేంద్రాల వద్ద ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలని, భద్రత పరంగా ఎలాంటి లోటుపాట్లకు తావివ్వరాదని అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషి సిబ్బందికి సూచించారు. ఈనెల 4వ తేదీన ఓట్ల లెక్కింపు నేపథ్యంలో శనివారం ఆమె ఎస్పీ మాధవరెడ్డితో కలిసి కౌంటింగ్ కేంద్రాలను, కేంద్రాల వద్ద భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. లేపాక్షి సమీపంలోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, హిందూపురం సమీపంలోని బిట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎం స్ట్రాంగ్ రూములు, ఓట్ల లెక్కింపు కేంద్రాలను పరిశీలించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రత, వాహనాల పార్కింగ్, బందోబస్తు చర్యలను డీఐజీ సమీక్షించారు. రెండు కౌంటింగ్ కేంద్రాల వల్ల మెరుగైన భద్రతకోసం అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయా కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన విజిటర్స్ రిజిస్టర్‌లో డీఐజీ, ఎస్పీ సంతకాలు చేశారు.

**అనుమతి ఉన్నవారికే ప్రవేశం..**

కౌంటింగ్ కేంద్రాల్లోకి ప్రవేశించేందుకు తిరిగి వచ్చేందుకు మాత్రమే మార్గాలు ఉండాలని డీఐజీ షిమోషి అధికారులకు సూచించారు. ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు ద్వారా కాకుండా ఇతర మార్గాల్లో ఎవరూ రాకుండా నిరంతర పహారా ఏర్పాటు చేయాలని, అవసరమైన చోట్ల ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రాల్లోకి కూడా ఎన్నికల కమిషన్ అనుమతించిన వారినే పంపాలన్నారు. బందోబస్తులో ఎలాంటి లోటుపాట్లు లేకుండా పటిష్టంగా చేపట్టాలని ఆదేశాలిచ్చారు. పోటీలో ఉన్న అభ్యర్థులు, పార్టీల ఏజెంట్లు తమ వాహనాలను నిర్దేశిత ప్రదేశంలోనే నిలుపుకునేలా చూడాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నందున జనం గుమిగూడ కుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కౌంటింగ్ కేంద్రాలకు వచ్చే ప్రతి వ్యక్తిని క్షుణంగా తనిఖీ చేయాలని, గుర్తింపు కార్డులను పరిశీలించిన తర్వాతే లోపలికి అనుమతించాలన్నారు. కౌంటింగ్‌కు వచ్చేవారు మొబైల్స్ తీసుకురాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అడినషన్ ఎస్పీ ఎన్.విష్ణు, డీఎస్పీలు శ్రీనివాసరావు, కంజాక్షన్, ఏఆర్ డీఎస్పీ విజయ్ కుమార్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



విజిటింగ్ బుక్‌లో సంతకం చేస్తున్న డీఐజీ షిమోషి, చిత్రంలో ఎస్పీ మాధవరెడ్డి

## వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మృతి



నారేపల్లి జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్)



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

- పుట్టపర్తి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వద్ద జగన్‌మోహన్‌రెడ్డి బైక్‌ను ఢీ కొన్న బొలేరో వాహనం
- చికిత్స ప్రారంభించేలోపే మృత్యువాత
- నివాళులర్పించిన ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి


కొత్తచెరువు: పుట్టపర్తి ప్రశాంతి నిలయం సమీపంలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వద్ద శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో వైఎస్సార్ సీపీ కొత్తచెరువు మండల కన్వీనర్ నారేపల్లి జగన్‌మోహన్‌రెడ్డి (67) మృతి చెందారు. వివరాల్లోకి వెళితే... కొత్తచెరువు మండలం నారేపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ కొత్తచెరువు మండల కన్వీనర్ నారేపల్లి జగన్‌మోహన్‌రెడ్డి శనివారం మధ్యాహ్నం కొత్తచెరువు నుంచి పుట్టపర్తికి బైక్‌పై బయలుదేరాడు. ఆయన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సమీపంలోకి రాగానే ఎదురుగా వేగంగా వచ్చిన బొలెరో ఢీ కొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన జగన్‌మోహన్‌రెడ్డిని స్థానికులు దగ్గరలోని సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించారు. అయితే కొన ఊపిరితో ఉన్న ఆయన కొద్దిసేపటికే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి హుటాహుటిన ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. జగన్‌మోహన్‌రెడ్డి భౌతిక కాయం వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. జగన్‌మోహన్‌రెడ్డి మృతి పార్టీకి తీరని లోటు అని దిగ్భ్రాంతి వ్యక్తం చేశాడు.

**ఆవిర్భావం నుంచి వైఎస్సార్ సీపీలోనే ..**

నారేపల్లి జగన్‌మోహన్‌రెడ్డి నియోజకవర్గంలోని వారందరికీ సుపరిచితుడు. 1991 నుంచి 1996 వరకూ నారేపల్లి సర్పంచ్‌గా పనిచేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో ఉంటూ క్రియాశీలకంగా పనిచేశారు. ప్రస్తుతం కొత్తచెరువు మండల కన్వీనర్‌గా కొనసాగుతున్నారు. ఆయన భార్య నల్లమాడ మార్కెట్ యార్డు చైర్‌పర్సన్‌గా పనిచేశారు. పుట్టపర్తి పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. జగన్‌మోహన్‌రెడ్డి అంత్యక్రియలు ఆదివారం స్వగ్రామం నారేపల్లిలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## సాగుకు సన్నద్ధం

- ఖరీఫ్ సీజన్ ఆరంభం
- రైతు ముంగిటకే విత్తన వేరుశనగ
- అనుకూలంగా వర్షాలు
- ఉత్సాహంలో రైతన్నలు



సాగుకు భూమిని సిద్ధం చేస్తున్న దృశ్యం

పుట్టపర్తి అర్బన్: ఖరీఫ్ సీజన్ వచ్చిందంటే రైతులకు పండుగే. ఈ సారి ఖరీఫ్‌కు ముందే తొలకరి వర్షాలు పలకరించడంతో రైతులు ఉత్సాహంగా సాగుకు సన్నద్ధమయ్యారు. ఈ వారంలో జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురవడంతో కొంతమంది సాగుకు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. మరోవైపు రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులను అందజేసే పనిలో వ్యవసాయ శాఖ బిజీగా ఉంది. గతంతో పోలిస్తే ఈ ఖరీఫ్‌లో వర్షాలు అధికంగా కురుస్తాయన్న వాతావరణశాఖ అధికారుల సూచనలతో సాగుకు ఉత్సాహంగా సన్నద్ధమవుతున్నారు.

**లక్ష క్వింటాళ్ల విత్తనం సిద్ధం..**

జిల్లాలో మే సాధారణ వర్షపాతం 55.9 మి.మీ కాగా ఈ ఏడాది మే నెలలో ఏకంగా 134.3 మి.మీ వర్షపాతం నమోదైంది. దీంతో ఇప్పటికే రైతులు పొలాలను దున్ని సాగుకు సిద్ధం చేస్తున్నారు. జిల్లా సాధారణ సాగు విస్తీర్ణం 2,44,763 హెక్టార్లు కాగా, ఇందులో ప్రధాన పంట వేరుశనగ 1,74,910 హెక్టార్లలో సాగులోకి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో సుమారు లక్ష క్వింటాళ్ల విత్తన వేరుశనగ సిద్ధం చేశారు. ఇప్పటి వరకూ 42,366 మంది రైతులు 34,843 క్వింటాళ్ల వేరుశనగ కాయలను అందజేశారు. జిల్లా వ్యాప్తంగా విత్తన వేరుశనగ పంపిణీ కొనసాగుతోంది. ఇక నీటి వసతి ఉన్న రైతులు 1,03,327 హెక్టార్లలో సాగుకు సిద్ధమయ్యారు. ప్రధాన పంటలైన వేరుశనగ, కంది, మొక్కజొన్న తదితర పంటలసాగుకు జూన్ 15 నుంచి జూలై ఆఖరు వరకూ మంచి సమయమని డీఏఓ సుబ్బారావు పేర్కొన్నారు.

**పెట్టుబడికి ఢోకా లేదు..**

రైతులు ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేయడానికి ఎటువంటి ఇబ్బంది లేకుండా ఇటీవలే ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ రూపంలో సుమారు రూ.105 కోట్ల రైతుల ఖాతాల్లో జమ చేశారు. దీంతో పాటు చేయూత, ఈబీసీ నేస్తం వంటి పథకాల డబ్బు నేరుగా ఖాతాల్లో జమ అయ్యింది. దీంతో పాటు సబ్సిడీతో వేరుశనగ కాయలు పంపిణీ చేస్తున్నారు. 30 శాతం సబ్సిడీతో కందులు, పెసలు, 50 శాతంతో రాగులు, కొర్రలు, పచ్చిరొట్ట విత్తనాలు రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు ఆయా రైతు భరోసా కేంద్రాల ద్వారా అందజేస్తారు. మరో మూడు రోజుల్లో నైరుతి రుతుపవనాలు జిల్లా వ్యాప్తంగా విస్తరించే అవకాశం ఉండటంతో రైతులంతా వర్షం కోసం ఎదురుచూస్తున్నారు.

ఈ ఖరీఫ్‌లో ప్రధాన పంటల సాగు విస్తీర్ణం అంచనా

| పంట | విస్తీర్ణం (హెక్టార్లలో.) |
|---|---|
| వేరుశనగ | 1,74,910 |
| కంది | 26,528 |
| మొక్కజొన్న | 15,221 |
| వరి | 5,031 |
| ఉలవ | 9,193 |
| రాగి | 2,528 |

## క్లుప్తంగా

### కుక్కల దాడిలో గొర్రె పిల్లల మృతి


మృతి చెందిన గొర్రె పిల్లలు

కదిరి అర్బన్: మండలంలోని వరిగిరెడ్డిపల్లి తండాలో కుక్కలు స్వైరవిహారం చేయడంతో హరికృష్ణ నాయక్‌కు చెందిన 11 గొర్రె పిల్లలు మృతి చెందాయి. శనివారం ఉదయం ఇంటి వద్ద ఆవరణలో ఉన్న గొర్రె పిల్లలపై కుక్కలు మూకుమ్మడిగా దాడి చేసినట్లు బాధితుడు తెలిపాడు. ఘటనతో దాదాపు రూ.40 వేల వరకూ నష్టపోయినట్లు వాపోయాడు.

### వివాహిత అనుమానాస్పద మృతి


మృతురాలు లక్ష్మి

రొద్దం: ధర్మవరానికి చెందిన ఓ వివాహిత రొద్దం మండలంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పెద్దకోడిపల్లి గ్రామ సమీపంలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లుగా స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతురాలిని ధర్మవరంలోని దుర్గానగర్‌కు చెందిన ఎరికల గుద్దెల శంకర్ భార్య కత్తి లక్ష్మి(35)గా గుర్తించారు. శుక్రవారం ఆమె రొద్దం గ్రామానికి వచ్చినట్లుగా ప్రాథమిక విచారణలో నిర్ధారించారు. శనివారం ఉదయం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకోవడంపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

### భక్తులతో పోటెత్తిన 'ఖాద్రీ'


దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. కదిరి పరిసరాల ప్రాంతాల నుంచే కాక కర్ణాటక, చిత్తూరు, అనంతపురం, వైఎస్సార్ జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. విశేష పూజలు, అలంకరణలు పెద్ద ఎత్తున జరిగాయి. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

# స్టంట్ చేస్తే తాట తీస్తారు!

- ట్రాఫిక్ నిబంధనలు కఠినతరం చేసిన ప్రభుత్వం
- ఈ నెల 1 నుంచే అమల్లోకి నూతన ట్రాఫిక్ నిబంధనలు
- మద్యం మత్తులో వాహనం నడిపితే మూడేళ్ల జైలు.
- అంబులెన్స్‌కు దారి ఇవ్వకపోతే రూ.10 వేల ఫైన్
- మైనర్ చేతికి వాహనం ఇచ్చినా నేరమే




హిందూపురం అర్బన్: కొందరు యువకులు రోడ్ల మీద డేంజరస్ స్టంట్ చేస్తుంటారు. చేతులు వదిలేసి బైక్‌ను నడపడం, హెల్మెట్ లేకుండా బైక్‌ను గాల్లో పైకి లేపడం చేస్తుంటారు. సడెన్ బ్రేక్లు వేస్తూ కట్ కొడతారు. హైవేల మీద రేసింగ్‌కు పాల్పడుతుంటారు. బైక్‌లే కాదు కారును కూడా స్పీడ్గా పోనిచ్చి, సడెన్‌గా బ్రేక్‌లు వేసి రోడ్డుపై వీలింగ్ చేస్తుంటారు. మరికొందరు పెద్దగా హారన్ మోగిస్తూ స్పీడ్‌గా దూసుకెళుతుంటారు. ఈ క్రమంలో వారు డేంజర్‌లో పడటమే కాకుండా, వెనుక, ముందు వస్తున్న వాహనదారులనూ ప్రమాదాల్లోకి నెట్టేస్తుంటారు. వీరి వల్ల తమ దారిన తాము పోయే అమాయకులు కూడా బలైన సంఘటనలు కోకొల్లలు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తూ ఇకపై రోడ్డుపై స్టంట్ చేస్తే తాట తీసేందుకు పోలీసు యంత్రాంగం సిద్ధమైంది. నిబంధనల ఉల్లంఘనలు ఎంతటి వారైనా గూస్‌బంప్‌మనిపించేలా కఠిన చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధం చేశారు.

జిల్లాలో ఏదో ఒక ప్రాంతంలో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుని ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఈ క్రమంలో ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పిస్తూ ట్రాఫిక్ నిబంధనలు కఠినతరం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 1వ తేదీ నుంచే నూతన నిబంధనలు అమల్లోకి వచ్చాయి. నిబంధనలు పాటించని వాహనదారులపై నూతన చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలని ఇప్పటికే సిబ్బందిని ఎస్పీ మాధవరెడ్డి ఆదేశించారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ముగిసిన తర్వాత రవాణాశాఖతో సమన్వయం చేసుకుని ట్రాఫిక్ నిబంధనలు పటిష్టంగా అమలు చేసేందుకు యంత్రాంగం సిద్ధమవుతోంది.

**చట్టం సవరిస్తూ ఉత్తర్వులు జారీ..**

నిత్యం జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో ప్రజల ప్రాణాలకు భద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనల్లోని పలు సెక్షన్‌లను కఠినంగా అమలు చేసేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. ఇకపై నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడిపితే జరిమానాతో పాటు జైలు శిక్ష విధించేలా జీఓ -21 మోటారు వాహన చట్టంలోని సెక్షన్ 200ను సవరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ ఉత్తర్వుల మేరకు గరిష్టంగా పదేళ్ల వరకూ జైలు శిక్ష పడే అవకాశముంది. ఇది వాహనదారుల్లో తప్పక మార్పు తెస్తుందని రవాణా శాఖ అధికారులు, పోలీసులు భావిస్తున్నారు.

**కొత్త నిబంధనలు ఇలా..**

- డ్రైవింగ్ లైసెన్స్ లేని వారికి వాహనం ఇస్తే యజమానికి ఇప్పటి వరకు రూ. వెయ్యి జరిమానా విధించేవారు. ఇకపై దీనిని రూ.5వేలకు పెంచారు.
- లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన వ్యక్తికి రూ.500 ఉన్న ఫైన్‌ను రూ.5వేలు చేశారు.
- మైనర్లకు వాహనం ఇచ్చినా రూ. 5వేలు జరిమానా చెల్లించక తప్పదు.
- ర్యాష్ డ్రైవింగ్ చేసినా, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవ్ చేసినా రూ.2వే లు విధిస్తున్న జరిమానాను రూ.10 వేలకు పెంచారు.
- మద్యం సేవించి వాహనం నడిపితే మొదటి సారి రూ.10వేలు జరిమానా, ఆరు నెలల జైలు శిక్ష, రెండో సారి ఇదే తప్పిదం చేస్తే రూ.15 వేల జరిమానా, మూడేళ్ల వరకు జైలు శిక్ష విధిస్తారు.
- వాహనాలతో రేసింగ్‌కు పాల్పడితే మొదటిసారి రూ.5వేలు, రెండో సారి రూ.10వేలు జరిమానా విధిస్తారు.
- అంబులెన్స్, అగ్నిమాపక వాహనాలకు దారి ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే రూ.10 వేలు, హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే రూ.వెయ్యి జరిమానా విధిస్తారు.
- మైనర్లు వాహనం నడిపి కోర్టుల్లో నిరూపితమైతే సంరక్షకుడితో పాటు వాహన యజమాని దోషిగా పరిగణించబడుతారు. ఇందుకు రూ.25వేల జరిమానాతో పాటు మూడేళ్ల వరకు జైలు శిక్ష విధిస్తారు. వాహన రిజిస్ట్రేషన్ సైతం రద్దు చేస్తారు.

### పేలుడు పదార్థం తిన్న గేదెకు గాయాలు


గాయపడిన గేదె

రొద్దం: పేలుడు పదార్థం తిన్న గేదె నోరు ఛిద్రమైంది. వివరాలు.... రొద్దం గ్రామానికి చెందిన పాడి రైతు సరోజమ్మ శనివారం ఉదయం తన గేదెను గ్రామ సమీపంలోని చిన్న చెరువు వద్దకు మేపునకు తోలుకెళ్లింది. బయలు ప్రదేశంలో పచ్చిగడ్డి మేస్తుండగా గేదె నోట్లో పేలుడు పదార్థం చిక్కుకుని పేలింది. దీంతో గేదె దవడ పేలిపోయింది. అడవి పందులు వేటాడేందుకు గుర్తు తెలియని వ్యక్తులు పెట్టిన డిటోనేటర్ కలిపిన అన్నం ముద్ద తినడంతోనే ఈ ఘటన చోటు చేసుకున్నట్లుగా అనుమానాలు వ్యక్తమయ్యాయి. చికిత్స కోసం గేదెను హిందూపురంలోని పశువైద్యశాలకు తరలించారు. ఘటనతో రూ.80 వేలు నష్టపోయినట్లు బాధిత పాడి రైతు వాపోయారు.

### టపాసుల సీజ్


సీజ్ చేసిన టపాసులు చూపుతున్న పోలీసులు

కదిరి టౌన్: స్థానిక మున్సిపల్ పరిధిలోని మూర్తిపల్లిలో 640 కిలోల టపాసులను పోలీసులు సీజ్ చేశారు. వీటి విలువ రూ.2 లక్షలు ఉంటుందని డీఎస్పీ శ్రీలత తెలిపారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను ఆమె వెల్లడించారు. కార్డెన్ సెర్చ్‌లో భాగంగా కదిరి పట్టణ సీఐ కె.పుల్లయ్య ఆధ్వర్యంలో శనివారం మూర్తిపల్లిలో పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారన్నారు. స్థానిక టీడీపీ నేత షబ్బీర్ ఇంట్లో సందీప్‌కు చెందిన రూ. 2 లక్షల విలువైన టపాసులు గుర్తించి, సీజ్ చేశామన్నారు. సందీప్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

**విజయోత్సవ ర్యాలీలు నిషేధం**

ఓట్ల లెక్కింపు సందర్భంగా ఈ నెల 4న విజయోత్సవ ర్యాలీలపై నిషేధం విధించినట్లు డీఎస్పీ శ్రీలత తెలిపారు. 144 సెక్షన్ 30 యాక్ట్ అమలులో ఉందని, దీంతో కదిరి డివిజన్ పరిధిలో సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించడానికి వీల్లేదన్నారు. 3, 4, 5వ తేదీల్లో మద్యం విక్రయాలు నిలుపుదల చేసినట్లు తెలిపారు. ఎక్కడైనా మద్యం విక్రయాలు జరిపితే సంబంధీకులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో పట్టణ సీఐ పుల్లయ్య, ఎస్‌ఐ బాబ్జాన్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎవరి లెక్క వారిదే!

- ఎటు చూసినా ఎన్నికల ఫలితాలపైనే చర్చ
- కౌంటింగ్ సమీపిస్తున్న కొద్దీ పెరుగుతున్న ఉత్కంఠ



హిందూపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికల గెలుపుపై ఎవరి లెక్కలు వారు వేస్తున్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సీఎం జగన్ చేపట్టిన సంస్కరణలు, అమలు చేసిన సంక్షేమ పథకాలే తమ గెలుపునకు బాటలు వేస్తాయని వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ధీమాతో ఉండగా... మరో వైపు తమదైన అంచనాలతో లెక్కలను తారుమారు చేస్తూ ప్రతిపక్ష పార్టీ నాయకులు చర్చ లేవనెత్తుతున్నారు.

**అందరి నోటా అదే మాట..**

జిల్లా వ్యాప్తంగా ఏ ఒక్కరి నోట విన్న ఒకే మాట వినబడుతోంది. ఎన్నికల ఫలితాలు ఎలా ఉంటాయని, ఏ పార్టీకి ఎన్ని స్థానాలు దక్కుతాయని, ఏ పార్టీ అధికారంలోకి వస్తుందనే చర్చలు జోరుగా సాగుతున్నాయి. ఈ క్రమంలోనే కౌంటింగ్ ప్రక్రియ దగ్గరపడుతున్న కొద్దీ అందరిలోనూ ఉత్కంఠ పెరిగిపోతోంది. దీంతో ఉత్కంఠను ఆపుకోలేని చాలా మంది కౌంటింగ్ రోజున హిందూపురంలో తిష్ట వేసేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో హిందూపురంలోని లాడ్జీలను ముందస్తుగా బుక్ చేసుకుంటున్నారు. ఇప్పటికే హిందూపురంలోని లాడ్జీలన్నీ ఫుల్ కాగా, కొన్ని రాజకీయ పార్టీలు కల్యాణ మంటపాలు, ఫంక్షన్ హాళ్లను బుక్ చేస్తుండడం గమనార్హం.

**అంచనాలు... లెక్కలు ఇలా...**

హిందూపురంలోని బిట్ కళాశాల, లేపాక్షిలోని గురుకుల పాఠశాలలో ఈ నెల 4న ఓట్ల లెక్కింపునకు అధికారులు చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో గెలుపోటములపై పోలింగ్ ముగిసిన మే 13 నుంచే అంచనాలు మొదలయ్యాయి. ఈ క్రమంలో పోటీలో ఉన్న రెండు ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు బూత్‌ల వారీగా పోలైన ఓటింగ్ సరళిని పరిగణనలోకి తీసుకుని గెలుపు అవకాశాలపై అంచనాలు వేస్తున్నారు. ప్రధానంగా ఈ ఎన్నికల్లో మహిళలు, వృద్ధులు గంటల తరబడి బారులు తీరి ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం 7 అసెంబ్లీ, హిందూపురం పార్లమెంట్ స్థానానికి గ్రామీణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం గతంలో కంటే ఈ సారి గణనీయంగా పెరిగింది. దీంతో గెలుపు తమదేనన్న ధీమా వైఎస్సార్‌సీపీ నేతల్లో వ్యక్తమవుతోంది.

## దారిదోపిడీ కేసులో ముగ్గురి అరెస్ట్

గుంతకల్లు: లారీ డ్రైవర్, క్లీనర్‌ను బెదిరించి సెల్ ఫోన్లు, నగదు లాక్కొన్న కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మహేశ్వరరెడ్డి వెల్లడించారు. గురువారం అర్ధరాత్రి తర్వాత గుంతకల్లు మండలం నక్కనదొడ్డి సమీపంలో దుండగులు అటకాయించి దారి దోపిడీకి పాల్పడిన విషయం తెలిసిందే. లారీ డ్రైవర్ ఇషాక్ ఫిర్యాదు మేరకు అప్రమత్తమైన గుంతకల్లు పోలీసులు జాతీయ రహదారిపై విస్తృత తనిఖీలు చేపట్టారు. శుక్రవారం రాత్రి 8.30 గంటలకు గుత్తి నుంచి గుంతకల్లు వైపుగా వస్తున్న బొలెరో వాహనాన్ని గొల్లలదొడ్డి వద్ద అటకాయించి పరిశీలించారు. వాహన నంబర్ (ఏపీ 16ఈఎఫ్ 6661) ఆధారంగా దుండగులు ఉపయోగించిన వాహనం అదేనని గుర్తించారు. ఆ సమయంలో ఒకరు పారిపోగా ముగ్గురు పట్టుబడ్డారు. పట్టుబడిన వారిలో గుత్తి ఆర్‌ఎస్‌కు చెందిన సి.హెచ్ అజయ్‌రాజ్, బి.ప్రశాంత్, గుత్తి మండలం లచ్చానుపల్లికి చెందిన వి.ఆదర్శ్‌రాజ్ ఉన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

### వ్యక్తి ఆత్మహత్య

గుడిబండ: మండలంలోని భూతప్ప కనుమ అటవీ ప్రాంతంలో శనివారం సాయంత్రం ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ మునిప్రతాప్, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడిని మడకశిర పట్టణానికి చెందిన మజఫ్‌వుల్లా (35)గా గుర్తించారు. అప్పులు తీర్చే మార్గం కానరాక ఆత్మహత్యకు పాల్పడినట్లుగా ప్రాథమిక దర్యాప్తులో పోలీసులు నిర్ధారించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

### వ్యక్తి బలవన్మరణం

సోమందేపల్లి: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... సోమందేపల్లిలోని ఇందిరానగర్‌కు చెందిన రఫీ(42)కి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సొంతంగా చేతి మగ్గం ఏర్పాటు చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావడంతో శనివారం ఇంట్లోనే మగ్గానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ విజయ్‌కుమార్ అక్కడకు చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేశారు.

## వాహనం బోల్తా - తమిళనాడు వాసి దుర్మరణం



రాజశేఖర్ మృతదేహం వద్ద రోదిస్తున్న స్నేహితుడు, ప్రమాదంలో దెబ్బతిన్న వాహనం

- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

పరిగి: మండలంలోని ధనాపురం క్రాస్ సమీపంలో 544ఈఈ జాతీయ రహదారిపై శనివారం చోటు చేసుకున్న ప్రమాదంలో తమిళనాడుకు చెందిన ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు... తమిళనాడులోని క్రిష్ణగిరికి చెందిన రామకృష్ణ, సెల్వరాజ్, తమిళ్‌మణి, రాజశేఖర్ (58) నలుగురూ మడకశిర ప్రాంతంలో చేపట్టిన క్వారీల పనుల నిమిత్తం హిటాచీ వ్యాపార లావాదేవీలపై చర్చించేందుకు శనివారం వచ్చారు. మధ్యాహ్నం భోజనానికని టీఎస్ 29 బీహెచ్ 3456 నంబర్ సఫారీ కారులో హిందూపురానికి బయలుదేరారు. పరిగి మండలం ధనాపురం క్రాస్ దాటగానే జాతీయ రహదారిపై పల్లపు ప్రదేశంలో వేగంతో వెళ్తుండగా ఎదురుగా వచ్చిన ఓ ద్విచక్ర వాహనదారుడిని తప్పించే క్రమంలో కారు అదుపు తప్పి రోడ్డు పక్కన బోల్తాపడింది. వాహనం డోర్లు తెరుచుకోవడంతో డ్రైవింగ్ చేస్తున్న రామకృష్ణ, పక్కనే కూర్చొన్న రాజశేఖర్ ఎగిరి బయటకు వచ్చి పడ్డారు. తీవ్రంగా గాయపడిన రాజశేఖర్ అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన ముగ్గురినీ స్థానికులు వెంటనే హిందూపురంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఏఎస్‌ఐ జయలత, హెచ్‌సీ శ్రీనివాసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ప్రమాదానికి కారణాలను స్థానికులతో ఆరా తీశారు. క్షతగాత్రుల బంధువులకు సమాచారం అందించామని, వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయనున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

## విషజ్వరంతో చిన్నారి మృతి


అనిరుద్ సాయి (ఫైల్)

పరిగి: విష జ్వరంతో ఓ చిన్నారి మృతి చెందాడు. బాధిత కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... పరిగి మండలం ఆనందపాళ్యం గ్రామానికి చెందిన జయరాం, జ్యోతి దంపతుల కుమారుడు అనిరుద్ సాయి(6) జ్వరంతో శనివారం వేకువజామున మృతి చెందాడు. గత శుక్రవారం సాయంత్రం అనిరుద్ సాయికి జ్వరం వచ్చింది. దీంతో తల్లిదండ్రులు హిందూపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. జ్వరం తీవ్రత పెరిగడంతో వైద్యుడి సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ప్రైవేటు ఆస్పత్రి వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే తమ బిడ్డ చనిపోయినట్లు తండ్రి జయరాం ఆరోపించారు.

**ఆనందపాళ్యంలో వైద్య సిబ్బంది పర్యటన..**

చిన్నారి అనిరుద్ మృతి చెందిన విషయం తెలుసుకున్న పరిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు అప్రమత్తమయ్యారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్వరూపరెడ్డి, జిల్లా మలేరియా సబ్ యూనిట్ అధికారి శివన్న తదితరులు శనివారం ఆనందపాళ్యంలో పర్యటించారు. చిన్నారి కుటుంబసభ్యులను కలిశారు. జరిగిన పరిణామాలను తల్లిండ్రులతో ఆరా తీశారు. చిన్నారి అనిరుద్ సాయికి జ్వరం వచ్చిందని అది మూర్ఛగా మారడంతో ప్రాణాపాయం కలిగిందని, జరిగిన పరిణామానికి తామెంతో చింతిస్తున్నామన్నారు. మలేరియా, డెంగీతో చిన్నారి చనిపోలేదని నిర్ధారించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ వన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

## అలరించిన సాయి స్మరణం


కచేరి నిర్వహిస్తున్న తమిళనాడు సత్యసాయి యూత్ సభ్యులు

ప్రశాంతి నిలయం: సత్యసాయిని స్మరిస్తూ తమిళనాడుకు చెందిన సాయి యూత్ సభ్యులు శనివారం సాయంత్రం నిర్వహించిన సంగీత కచేరి భక్తులను అలరించింది. అనంతరం భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఉత్తర కన్నడ జిల్లాలో ప్రజలకు దంతపరమైన వైద్య సేవలు ఉచితంగా అందించే లక్ష్యంతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ రూపొందించిన మొబైల్ డెంటల్ క్లినిక్‌ను ప్రారంభించారు. సత్యసాయి మహాసమాధి వద్ద వాహనానికి ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు, సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ చైర్మన్ చక్రవర్తి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### 65 మందికి ఉద్యోగాలు

హిందూపురం: స్థానిక బాలయేసు డిగ్రీ కళాశాల వేదికగా శ్రీనివాస బాలాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జాబ్ మేళాలో 65 మందికి టాటా ఎలక్ట్రానిక్స్ కంపెనీలో ఉద్యోగాలు దక్కాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన జాబ్ మేళాకు 120 మంది హాజరయ్యారు. వీరిలో ప్రతిభ చూపిన 65 మందికి త్వరలో ఆఫర్ లెటర్లను అందజేయనున్నట్లు యాజమాన్యం ప్రకటించింది. కార్యక్రమంలో కంపెనీ అపాయింట్‌మెంట్ మేనేజర్ అసితోష్, అసిస్టెంట్ మేనేజర్ వంశి, శ్రీనివాస బాలాజీ ఫౌండేషన్ ప్రతినిధులు రఘునాథరెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, బాలయేసు కళాశాల ప్రిన్సిపాల్ బలరామిరెడ్డి పాల్గొన్నారు.

### రైలు ఢీ కొని యువకుడి మృతి


మృతుడు అజయ్

హిందూపురం అర్బన్: రైలు ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. జీఆర్పీ ఎస్‌ఐ బాలాజీ నాయక్ తెలిపిన మేరకు హిందూపురంలోని శివాలయం వద్ద టెంకాయల వ్యాపారం చేసే వెంకటేశులు కుమారుడు అజయ్‌కుమార్(18) శనివారం రాత్రి 7 గంటలకు స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో మోడల్ కాలనీ వద్ద పట్టాలు దాటే ప్రయత్నం చేశాడు. అయితే సెల్‌ఫోన్‌లో నిమగ్నమైన యువకుడు అటుగా వస్తున్న గూడ్సు రైలును గమనించలేదు. దీంతో రైలు ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని వెంటనే తోటి మిత్రులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

### ఏపీజీబీలో రక్తదాన శిబిరం


రక్తదాతలను అభినందిస్తున్న బ్యాంకు చైర్మన్ సత్యప్రకాశ్‌సింగ్

కడప కోటిరెడ్డిసర్కిల్: ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు 19వ వార్షికోత్సవ సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. వైఎస్సార్ జిల్లా కడపలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి చైర్మన్ సత్యప్రకాశ్‌సింగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తమ బ్యాంకు వ్యాపార నిర్వహణలో ఇతర బ్యాంకుల కంటే ముందు ఉండడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విరివిగా రక్తదానం చేయాలని ఖాతాదారులను కోరారు. 70 సార్లకు పైగా రక్తదానం చేసిన రెడ్‌క్రాస్ సొసైటీ స్పెషల్ ఆఫీసర్ శివ శంకర్‌రెడ్డిని అభినందించారు. ఆర్ఎం శ్రీనివాసప్రసాద్, ప్రధాన, ప్రాంతీయ కార్యాలయ సిబ్బంది, ఇతర శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.